క్లుప్తంగా

సర్పంచ్‌కు ఎమ్మెల్యే పరామర్శ

బంట్వారం: కోట్‌పల్లి మండలం కంకణాలపల్లి సర్పంచ్ చంద్రకళ కుటుంబ సభ్యురాలు నర్సమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆనంద్ సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. సర్పంచ్ చంద్రకళతో మాట్లాడి సానుభూతి వ్యక్తంచేశారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సుందరి అనిల్, పీఏసీఎస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు వెంకటేశ్ యాదవ్, నాయకులు కరుణాకర్‌రెడ్డి, మహబూబ్ ఉన్నారు.

వైభవంగా చౌడేశ్వరి జయంత్యుత్సవాలు


విశేష అలంకరణలో అమ్మవారు

కొడంగల్ రూరల్: పట్టణశివారులో వెలసిన శ్రీచౌడేశ్వరి మాతా జయంతి ఉత్సవాలను ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి పంచామృతంతో అభిషేకం, విశేష అలంకరణ, మంగళహారతులు పడుతూ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవతామూర్తికి పల్లకీసేవ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో తొగుటవీర క్షత్రియ సంఘం అధ్యక్షుడు దేవరకొండ చిన్న రాములు, గుర్రం శంకర్, చౌడప్ప, రాఘవేందర్, అనిల్, రామచందర్, దేవరకొండ శ్రీనివాస్, వెంకటేశ్, మేడిపల్లి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తో గ్రామాల అభివృద్ధి

నవాబుపేట: బీఆర్‌ఎస్ పాలనలో గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నాయని ఆ పార్టీ సీనియర్ నాయకుడు రంగారెడ్డి అన్నారు. సోమవారం నవాబ్‌పేట మండలం మైతాబ్‌ఖాన్‌గూడలో నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. గ్రామంలో అంతర్గత మురుగు కాలువలు, సీసీరోడ్లు పూర్తి చేశామని తెలిపారు. ఆయన వెంట వార్డు సభ్యులు రాజు, నజీర్, పార్టీ నాయకుడు రాజు, తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం

కుల్కచర్ల: చౌడాపూర్ మండలం మందిపల్ గ్రామానికి చెందిన కుండల అనంతయ్య అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న టీడీపీ పరిగి ఇన్‌చార్జి కాసాని వీరేశ్ ముదిరాజ్ బాధిత కుటుంబ సభ్యులకు రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. వీరాపూర్ గ్రామానికి చెందిన పిల్లి రమేష్ అనే యువకుడు అనారోగ్యంతో మృతిచెందగా.. వారి కుటుంబీకులకు రూ.5వేలు సాయం అందజేశారు. పార్టీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు మాసయ్య, కాసాని యువసేన నాయకులు బుచ్చయ్య, రామస్వామి, శేఖర్, సాయి, కృష్ణ, పవన్, ఎండీ గోరెపాషా, ఎండీ దస్తగిరి, అంజి, రవి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు..

కుల్కచర్ల: కుల్కచర్ల మండలం కామునిపల్లి గ్రామానికి చెందిన గరక అంజిలమ్మ సోమవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్ రెడ్డి స్థానిక నేతలతో తక్షణ ఆర్థిక సహాయంగా రూ.5వేలను అందజేశారు.

సోమాతి అమావాస్య పూజలు


శివారాధన చేస్తున్న భక్తులు

ధారూరు: వీరభద్రేశ్వరస్వామి దేవాలయంలో నెలకొన్న కపిలేశ్వరస్వామికి సోమవారం సోమాతి అమావాస్య పూజలు నిర్వహించారు. ఉపవాస దీక్ష చేపట్టిన భక్తులతో పూజలు పూర్తిచేయించినట్లు పూజారి చెన్న బసవయ్య స్వామి తెలిపారు. అమావాస్య రోజున దీక్ష చేపట్టి శివారాధనతో పాటు రావి చెట్టు వద్ద 108 ప్రదక్షిణలు చేస్తే సకల దోషాలు తొలగిపోతాయనే విశ్వాసం భక్తుల్లో నెలకొంది.

యువ పోరాట యాత్రను జయప్రదం చేయండి

పరిగి: యువత కోసం యువజన కాంగ్రెస్ ఎల్లప్పుడూ పోరాటం చేస్తుందని పార్టీ జిల్లా నాయకుడు ఎర్రగడ్డపల్లి జగన్ అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలోని టీఆర్‌ఆర్ నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి యువ పోరాట యాత్ర చేపడుతున్నారని తెలిపారు. ఈ నెల 19న పరిగి పట్టణ కేంద్రం కొడంగల్ చౌరస్తాకు యాత్ర చేరుకుంటుందని, ఈ సందర్భంగా సమావేశం ఏర్పాటు చేస్తామని, సమీక్షకు నియోజకవర్గ యువజన నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు రాయకృష్ణారెడ్డి, సాయిరెడ్డి, నాగవర్ధన్, శ్రీకాంత్‌రెడ్డి, నవాజ్ పాల్గొన్నారు.

‘అధిక ధర’ల దరువు


పెద్దేముల్ మండలంలో విక్రయాలకు సిద్ధంగా ఉన్న డీఏపీ

- ఎరువుల వ్యాపారుల ఇష్టారాజ్యం
- రైతులను దోచేస్తున్న దుకాణదారులు
- ప్రశ్నిస్తే.. నిలువ లేదంటూ దబాయింపు
- ఈ–పాస్‌ను పట్టించుకోని వైనం
- కానరాని స్టాక్, ధరల పట్టిక

పెద్దేముల్: ఎరువుల వ్యాపారుల ఇష్టారాజ్యం కొనసాగుతోంది. 45కిలోల యూరియ బస్తాను రూ.269లకు విక్రయించాల్సి ఉండగా.. రూ.300 నుంచి రూ.330 వరకు అమ్ముతున్నారు. ఇదేమని రైతులు ప్రశ్నిస్తే.. ఎరువు లేదని తెగేసి చెబుతున్నారు. కళ్లెదురుగా బస్తాలు కనబడుతున్నా.. అవి కావు అంటూ దబాయిస్తున్నారని అన్నదాతలు వాపోతున్నారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా.. ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. రైతులకు అందచేస్తున్న ఎరువులను ఈ పాస్ ద్వారా అందజేయాలని ప్రభుత్వం ఎరువుల దుకాణదారులను ఆదేశించినా.. వాటిని పట్టించుకోవడం లేదు. ఈ–పాస్‌ను చూపిస్తే అసలు భాగోతం భయటపడుతుందనే దాన్ని పక్కన పెట్టి, యూరియాతో పాటు, గడ్డి మందులను అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు సమాచారం.

రూ.1,600 నుంచి రూ.1,800 వరకు..

వానాకాలం సీజన్ ప్రారంభం సమయంలో వ్యవసాయ, పోలీస్ అధికారులు ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి, అధిక ధరలకు, లైసెన్స్ లేకుండా విక్రయించరాదని వ్యాపారులకు చెప్పినా.. వారి తీరు మారటం లేదు. పది రోజుల క్రితం ఓ రైతు మండల కేంద్రంలో.. డీఏపీ ఎరువుల కోసం ఓ దుకాణానికి వెళితే రూ.1,600 నుంచి రూ.1,800లకు విక్రయించనున్నామని చెప్పారు. ఇదే విషయం జిల్లా అధికారి గోపాల్‌కు బాధిత రైతు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో వెంటనే ఏఓ నజీరొద్దీన్ వచ్చి రూ.1,350కి డీఏపీ ఎరువుల బస్తాను విక్రయింపజేశారు. మండలంలో ఎరువుల వ్యాపారులు రైతులను దోచుకుంటున్నా.. సంబంధిత అధికారులు సరిగ్గా స్పందించకపోవడంతోనే.. వారి ఆగడాలు పెరుగుతున్నాయని పలువురు రైతులు అంటున్నారు.

అన్నింటినీ సోదా చేయాలి

నాలుగు రోజుల క్రితం తాండూరు ఏడీఏ, పెద్దేముల్ ఏఓ.. మండల కేంద్రంలోని కొన్ని ఎరువుల దుకాణాలను మాత్రమే సోదాలు చేసి, మిగతా వాటిని వదిలేశారని రైతులు ఆరోపిస్తున్నారు. అధికారులు వచ్చేది రెండుమూడు మాసాలకు ఒకసారి, అలా వచ్చినప్పుడు అన్ని ఎరువుల దుకాణాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని కోరుతున్నారు. ఎరువులు, మందులు అధిక ధరలకు విక్రయిస్తున్నారని, ధరల పట్టిక, స్టాక్ బోర్డు కనబడటం లేదని, వీటన్నింటిని పరిగణలోకి తీసుకొని వ్యవసాయ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలంటున్నారు.

వ్యాపారుల ఇష్టారాజ్యం



ఎరువుల వ్యాపారుల ఆగడాలు పెరుగుతున్నాయి. మందులు, ఎరువులను అధిక ధరకు విక్రయిస్తూ.. రైతులను దోచుకుంటున్నారు. ఇదేమని అడిగితే స్టాక్ లేదంటూ పంపించేస్తున్నారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోవటం లేదు. ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలి.

–లోంక నర్సింహులు, రైతు, హన్మాపూర్

చర్యలు తీసుకుంటాం..



ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే ఒక్క రుపాయి ఎక్కువ తీసుకున్నా.. చర్యలు తప్పవు. ఎరువులు, మందులు రైతులు కొన్నప్పుడు దుకాణదారుడి నుంచి రశీదు తప్పని సరిగా తీసుకోవాలి. ఒక బిల్లు ఇవ్వకపోయినా, స్టాక్, ధరల పట్టిక లేకపోయినా మాకు ఫిర్యాదు చేయండి.

– నజీరొద్దీన్, ఏఓ, పెద్దేముల్

చెత్త సేకరణలో సర్పంచ్‌లు


పెద్ద ఉమ్మెంతాల్‌లో ట్రాక్టర్‌తో చెత్తను సేకరిస్తున్న సర్పంచ్ శ్రీధర్‌గుప్తా

పూడూరు: సమస్యల సాధనకోసం పారిశుద్ధ్య కార్మికులు నిరవధిక సమ్మె బాటపట్టగా.. ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయి పల్లెలు కంపుకొడుతున్నాయి. సోమవారానికి నిరసన కార్యక్రమం పన్నెండు రోజులుకు చేరింది. దీంతో ఇళ్లల్లోనే చెత్త ఉండటంతో గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. చేసేది లేక కొందరు సర్పంచ్‌లు పారిశుద్ధ్య పనులకు నడుం కట్టారు. పంచాయతీ ట్రాక్టర్ నడుపుతూ చెత్తను సేకరిస్తున్నారు.

చెత్త సేకరణలో బిజీ..

సోమవారం పెద్ద ఉమ్మెంతాల్ సర్పంచ్ శ్రీధర్‌గుప్తా పంచాయతీ ట్రాక్టర్‌ను వీధుల గుండా తిప్పుతూ చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించారు. మీర్జాపూర్ సర్పంచ్ రవి.. కార్మికులు విధుల్లోకి రాకపోవడంతో వికారాబాద్ లేబర్ అడ్డా నుంచి కూలీలను తెప్పించి, చెత్తను సేకరించడంతో పాటు మురుగుకాలువలను శుభ్రం చేయిస్తున్నారు. పారిశుద్ధ్య పనులకు ఎవరూ ముందుకు రాకపోవడంతో సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు స్వచ్ఛతకు పాటుపడుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికుల సమస్యలు పరిష్కారించాలని పలువురు సర్పంచ్‌లు కోరుతున్నారు.

వసూళ్లకు పాల్పడుతున్న సర్పంచ్


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

- నాసిరకం పనులు చేపట్టి బిల్లులు కాజేత
- కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కొండల్‌యాదవ్

నవాబుపేట: సర్పంచ్ రావుగారి వెంకట్‌రెడ్డి గ్రామంలో అక్రమాలకు పాల్పడుతున్నారని, నాసిరకం పనులు చేపడుతూ బిల్లులు కాజేస్తున్నాడని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కొండల్ యాదవ్ ఆరోపించారు. ఈ మేరకు ఆయనపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్లకొండలో రియల్ వ్యాపారులు, మైనింగ్ నిర్వాహకుల నుంచి డబ్బులు వసూళ్లకు పాల్పడతున్నారని, భూముల క్రయవిక్రయాల్లో సర్పంచ్ కమీషన్లు దండుకుంటున్నాడన్నారు. సమావేశంలో వార్డు సభ్యులు పావని పరమేష్, అజుమొద్దీన్, శివకుమార్, జంగయ్య, నర్సింహులు, ప్రవీణ్, బుగ్గరాం, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, కుమార్, యాదగిరి, పరమేష్ తదితరులు ఉన్నారు.

వ్యాధుల కాలం.. లోపించిన పారిశుద్ధ్యం


అంగన్‌వాడీ కేంద్రం సమీప రోడ్డుపై నిలిచిన మురుగు

ధారూరు: ధారూరు మండలం నాగసమందర్ గ్రామంలో పలు వీధుల్లో మురుగు నీరు పారుతోంది. అసలే సీజనల్ వ్యాధుల కాలం.. ఆపై పారిశుద్ధ్యం లోపించి, దోమలు, ఈగల బెడదతో ఇబ్బంది పడుతున్నామని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇళ్లమధ్య మురుగు పారుతుండడంతో కనీసం నడవడానికి వీలు లేకుండా పోయిందని చెప్పారు. సర్పంచ్, జీపీ కార్యదర్శికి పలుమార్లు చెప్పినా.. పట్టించుకోలేదని ఆరోపించారు. సంబంధిత అధికారులు స్పందించి మురుగుకు అడ్డుకట్ట వేయించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

దౌల్తాబాద్: రైతుబీమాకు రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఏఈఓ శ్రీపతిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన నందారం గ్రామం రైతువేదికలో రైతుల బీమా పత్రాలను స్వీకరించారు. అర్హులైన వారు పట్టాదారు పాసు పుస్తకం, బ్యాంక్‌బుక్, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలను దరఖాస్తు ఫారానికి జత చేసి, ఈనెల 30వరకు ఏఈఓలకు అందజేయాలని సూచించారు.

అసదుద్దీన్‌పై విమర్శలు సరికాదు

కొడంగల్ రూరల్: అసదుద్దీన్ ఒవైసిపై పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి విమర్శలు చేయడం సరి కాదని ఎంఐఎం నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌బి.గుల్షన్ అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాజకీయ లబ్ధికోసం తరచూ ఎంపీపై విమర్శలు చేయడం, బీజేపీకి బీ అంటూ వ్యాఖ్యలు చేయడం మంచిది హితవు పలికారు.

ఇంటింటికీ మరుగుదొడ్డి తప్పనిసరి

కుల్కచర్ల: ఇంటింటికీ తప్పనిసరిగా మరుగుదొడ్డి, ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని ఏపీఎం శోభ అన్నారు. సోమవారం కుల్కచర్ల మండలం బండవెల్కిచర్ల గ్రామంలో ఇంటింటికీ తిరిగి మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడారు. మరుగుదొడ్లు లేకపోవడం వలన కలిగే నష్టాల గురించి ప్రజలకు వివరించారు. బహిరంగ మలవిసర్జన వలన వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంటుందని, అదేవిధంగా మురుగునీరు బయట ప్రదేశాల్లో నిల్వ ఉండటంతో దోమలకు ఆవాసాలుగా మారుతాయన్నారు. మహిళా సమాఖ్య సిబ్బంది పాల్గొన్నారు.

రేపు బైకు ర్యాలీ

తాండూరు టౌన్: సీపీఎస్ రద్దు చేయాలని, ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం తాండూరు పట్టణంలో నిర్వహించనున్న బైకు ర్యాలీకి ఉద్యోగ, ఉపాధ్యాయులు తరలిరావాలని ఆ సంఘం నాయకులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభం కానున్న కార్యక్రమానికి సీపీఎస్ పరిధిలో ఉన్న వారంతా హాజరు కావాలని పిలుపునిచ్చారు.

కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన


నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

అనంతగిరి: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జీపీ కార్మికులు నిరవధిక సమ్మె చేపట్టిన విషయం విధితమే. ఇందులో భాగంగా సోమవారం కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాద బీమా రూ.10లక్షలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్, నాయకులు అశోక్, నర్సింహులు, మల్లేశం, గౌస్, హుస్సేన్, పోచయ్య, బుచ్చయ్య, రాజు, రాములు, గోపాల్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి ఆణివార ఆస్థానం


ఆస్థానంలో స్వామివారు

కొడంగల్: శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం శ్రీవారి ఆణివార ఆస్థానం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి రోజువారి సేవా కార్యక్రమాలు, ఉత్సవాలతో పాటు వారం, నక్షత్రం, మాస, వార్షిక సేవలు ఉంటాయి. వార్షిక సేవల్లో ఆణివార ఆస్థానం ప్రముఖమైందని ఆలయ అర్చకులు తెలిపారు. సూర్యమానం సౌర పంచాంగం ప్రకారం దక్షిణాయానం రోజున ప్రారంభం అవుతుందని తెలిపారు. కర్కాటక సంక్రాంతి, ఆణివార ఆస్థానం ఆలయంలో నిర్వహిస్తున్నట్లు అర్చకులు వెల్లడించారు. తమిళ మాసం ఆణి చివరి రోజున ఉత్సవం చేస్తున్నట్లు పేర్కొన్నారు. భూదేవి సమేతంగా శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఉత్సవ మూర్తులను వజ్ర వైడూర్యాలతో అలంకరించి ఆస్థాన మండపంలో వేంచేసి ఆస్థానం నిర్వహించారు. విశేషంగా స్వామివారికి బెల్లం పొంగలి ప్రసాదం నైవేద్యంగా సమర్పించారు. సేవలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఒకే దేశం.. ఒకే సిద్ధాంతం


వికారాబాద్ అర్బన్: టిఫిన్ బైఠక్‌లో టిఫిన్ చేస్తున్న బీజేపీ నాయకులు

- పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలి
- బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతి కిరణ్

కుల్కచర్ల: ఒకే దేశం.. ఒకే సిద్ధాంతంతో బీజేపీ పనిచేస్తుందని ఆ పార్టీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతి కిరణ్, రాష్ట్ర నాయకుడు శరత్ కుమార్ రెడ్డిలు అన్నారు. సోమవారం కుల్కచర్ల మండలం బండవెల్కిచర్ల గ్రామం శ్రీ పాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో టిఫిక్ బైఠక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యకర్తల్లో ఐక్యతను తీసుకొచ్చి, పార్టీ అభ్యున్నతికి తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించు కోవడానికే ఈ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. అవినీతి రహిత దేశాన్ని నిర్మించడంలో ప్రధాని మోదీకి మనందరి మద్దతు అవసరమని, అందుకు ప్రతి ఒక్కరం సైనికుడిలా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఘణపురం వెంకటయ్య, బీసీమోర్చా జిల్లా అధ్యక్షుడు యాదయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశ్, మండల ప్రధాన కార్యదర్శులు హన్మంతు, నర్సింహరెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షుడు గడుసు మైపాల్, నాయకులు కాటనిపల్లి ఆంజనేయులు, చంద్రలింగం, చెల్లాపూర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బుగ్గరామేశ్వరం ఆలయంలో..

వికారాబాద్ అర్బన్: బీజేపీ ఎంతో బలంగా ఉందని చేవెళ్ల పార్లమెంట్ మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు సదానంద్ రెడ్డి ఆధ్వర్యంలో మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా వికారాబాద్ నియోజకవర్గ స్థాయిలో బుగ్గరామేశ్వరం దేవాలయంలో టిఫిన్ బైఠక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఎంపీ కొండా.. పార్టీ బలోపేతంపై చర్చించారు. నందకుమార్ యాదవ్, అమరేందర్ రెడ్డి, నవీన్, అసెంబ్లీ ఇన్‌చార్జి శ్రీధర్ రెడ్డి, శివరాజ్, మాధవరెడ్డి, కౌన్సిలర్ శ్రీదేవి, పార్టీ మండలాల అధ్యక్షులు రాజేందర్ రెడ్డి, సురేష్, గోపాల్ రెడ్డి, లక్ష్మారెడ్డి, రవీందర్ గౌడ్, కృష్ణ పాల్గొన్నారు.

అన్నదమ్ముల్లా కలిసిమెలసి ఉండాలి


మాట్లాడుతున్న ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి

తాండూరు రూరల్: ప్రతి ఒక్కరూ అన్నదమ్ముల్లా కలిసిమెలసి ఉండాలని కరన్‌కోట్ ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు పర్వతాపూర్‌లో గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడారు. గ్రామంలో ఏదైనా సమస్యలు, గొడవలు జరిగితే వెంటనే 100కు ఫోన్ చేయాలని సూచించారు. యువకులు మద్యానికి దూరంగా ఉండాలని, కష్టపడి చదువుకోవాలని సూచించారు. చిన్న సమస్యలకు మానసికంగా ఒత్తిడికి గురై ఆత్మహత్యలకు పాల్పడవద్దని చెప్పారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ దస్తప్ప, కానిస్టేబుళ్లు నరేష్, శ్రీశైలం, లక్ష్మీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్య, వైద్యానికి తొలి ప్రాధాన్యత

కొడంగల్: బహుజన సమాజ్ పార్టీ విద్య, వైద్యానికి మొదటి ప్రాధాన్యత ఇస్తుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అంగడిరాయిచూర్ నర్మద అన్నారు. సోమవారం అన్నారంలో నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జనాభాలో అత్యధికంగా ఉన్న బహుజనులకు బీఎస్పీ 70 అసెంబ్లీ సీట్లు ఇస్తుందని, అందులో కొడంగల్ ఒకటని తెలిపారు. చట్ట సభల్లో ప్రాతినిథ్యం లేని కులాలకు పార్టీ రాష్ట్ర సమన్వయ కర్త ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హామీ ఇచ్చినట్లు చెప్పారు. ప్రవీణ్ కుమార్ సీఎం అయితే బహుజనులకు న్యాయం జరుగుతుందన్నారు. అన్నారం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా అంజిలప్ప, ఉపాధ్యక్షుడు భీములు, ప్రధాన కార్యదర్శి మాసప్ప, కార్యదర్శులుగా సాయమ్మ, కిష్టమ్మ, బోనమ్మ, సాయిలును ఎన్నుకున్నట్లు ఆమె తెలిపారు.

రైతుకు కాస్త ఊరట

వికారాబాద్ అర్బన్: మొన్న రాత్రి కురిసిన వర్షం పంటలకు కాస్త జీవం పోసింది. వికారాబాద్ డివిజన్‌లో విత్తనాలు విత్తిన నాటి నుంచి ఆశించిన మేర వర్షాలు లేవు. దీంతో మొక్కల పెరుగుదల పూర్తిగా ఆగిపోయింది. ఆకాశంలో మబ్బులు కనిపిస్తున్నా వర్షాలు పడకపోవడంతో రైతులు దిగాలు చెందారు. అయితే ఆదివారం అర్ధరాత్రి, సోమవారం తెల్లవారు జామున కురిసిన వర్షం రైతులకు కొంత ఊరట కలిగించింది. భారీ వర్షం పడకపోయినప్పటికీ పంటలకు మాత్రం మేలు చేసిందని రైతులు అంటున్నారు. డివిజన్ పరిధిలో 9.0 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

కాంగ్రెస్, టీడీపీ ఒకటి కాదు

కొడంగల్: తెలంగాణ కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీ ఒకటి కాదని టీడీపీ జిల్లా ప్రచార కార్యదర్శి తలారీ శేఖర్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ మాటల వెనుక చంద్రబాబు కుట్ర ఉందని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారని మండిపడ్డారు. టీ కాంగ్రెస్ నేతలు వారి పాలసీ ప్రకారం మాట్లాడతున్నారని, ఇందులో బాబుకు సంబంధం లేదని తెలిపారు. రైతులకు ఉచిత కరెంటు విషయంలో రేవంత్ మాటలు ఆయన వ్యక్తిగతమన్నారు. టీడీపీ వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తుందన్నారు.

నానోతో అధిక దిగుబడి



- ద్రవ యూరియాతో తగ్గనున్న పెట్టుబడి
- అర లీటరు.. బస్తాతో సమానం
- మండల వ్యవసాయ అధికారి జయశంకర్

మోమిన్‌పేట: ‘కేంద్ర ప్రభుత్వం గుళికల రూపంలో 50 కిలోలు ఉన్న యూరియా బస్తాకు బదులుగా ద్రవ రూపంలో అరలీటరు ఉన్న నానో యూరియా సీసాను పంపిణీ చేస్తోంది. దీని వలన రైతుకు బస్తా బరువుతో పాటు, రవాణా భారం తగ్గుతుంది’ అని మండల వ్యవసాయ అధికారిక జయశంకర్ తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం మాట్లాడారు. రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు.


ఏఓ జయశంకర్

పంటలపై పిచికారీ

అర లీటరు నానో ఒక బస్తా యూరియాతో సమానమని, పత్తి, కూరగాయల సాగుకు పైపాటుగా పిచికారీ చేయాలని ఏఓ చెప్పారు. ఒక బస్తా గుళికల యూరియా ఎకరా పొలంలో వాడటం వలన 60శాతం మాత్రమే మొక్క గ్రహించగలుగుతుందని, మిగతా 40శాతం గాలిలో కలిసి వాయు కాలుష్యం ఏర్పడుతుందని ఆయన పేర్కొన్నారు. నానోను నేరుగా కాని, ఏదైనా పురుగు మందులో కలిపి పత్తిపై పిచికారి చేయాలని సూచించారు. ఆలా చేయడం వలన నేరుగా ఆకుల ద్వారా మొక్క వంద శాతం గ్రహిస్తుందని, కాలుష్యం కూడా ఉండదని తెలిపారు. వర్షాభావ, అధిక వర్షపాతం లోనూ నానోను పంటపై పిచికారీ చేయవచ్చన్నారు. దీంతో పంట ఎదుగుదలకు ఎక్కడా ఆంటకం కలగదని వెల్లడించారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం డీఏపీని కూడా ద్రవ రూపంలో తయారీకి శ్రీకారం చుట్టిందని చెప్పారు. రైతులు సేంద్రియ ఎరువులను భూమిలో వేసి కలియదున్నుకొని, నానో ఎరువులను పంటలపై పిచికారీ చేయాలని ఏఓ చెప్పారు.

అవగాహన కల్పిస్తున్నాం

నానో ఎరువులపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని, చాలా మందికి ఈ ద్రవ యూరియాపై అవగాహన లేదని ఏఓ తెలిపారు. ప్రతి ఫర్టిలైజర్ దుకాణంలో నానో అందు బాటులో ఉంటుందన్నారు. యూరియా బస్తాను తరలించాలంటే ఖర్చుతో కూడుకున్న పని అని, అదే నానో సీసాను చేతితో పట్టుకుపోవచ్చని వెల్లడించారు. గుళికల యూరియాతో పోల్చుకుంటే నానో ఉపయోగంతో పంట దిగుబడి పెరుగుతుందని చెప్పారు. రాబోయే రోజుల్లో గుళికల రూపంలో ఉన్న రసాయనిక ఎరువులు ద్రవ రూపంలో వస్తాయని పేర్కొన్నారు.